నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | ఆదివారం 28 ఏప్రిల్ 2024 | WARANGAL HANUMAKONDA

పోరుగడ్డకు ఉద్యమనేత

వరంగల్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పోరుగడ్డ ఓరుగల్లుకు ఉద్యమనేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రానున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల మీదుగా రోడ్‌షో ద్వారా వరంగల్ నగరానికి చేరుకుంటారు. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బయల్దేరి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, మడికొండ, కాజీపేట, అదాలత్, పెట్రోల్ పంప్ జంక్షన్ల మీదుగా హనుమకొండ చౌరస్తాకు వస్తారు. అక్కడ బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. రోడ్‌షో స్థలాలను శనివారం జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించగా, అధినేత రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

నేడు వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో

జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మీదుగా చేరుకోనున్న బీఆర్ఎస్ అధినేత

సాయంత్రం హనుమకొండ చౌరస్తాలో ప్రసంగం

రోడ్‌షో స్థలాలను పరిశీలించిన పార్టీ నేతలు

సమరోత్సాహంలో బీఆర్ఎస్ శ్రేణులు

కెప్టెన్ ఇంట్లో బస

రోడ్‌షో ముగిసిన తర్వాత హనుమకొండలోని మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఇంట్లో రాత్రి బస చేస్తారు. సోమవారం హంటర్‌రోడ్డు, వర్ధన్నపేట, తొర్రూరు, మరిపెడ మీదుగా ఖమ్మంలో రోడ్‌షోకు వెళ్తారు. బుధవారం సాయంత్రం మహబూబాబాద్‌లో రోడ్ షో నిర్వహిస్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు మద్దతుగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం వరంగల్‌కు చేరుకుని ఇక్కడే బస చేస్తారు. గురువారం హసన్‌పర్తి, హుజూరాబాద్ మీదుగా జమ్మికుంటకు చేరుకుని రోడ్‌షోలో పాల్గొంటారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో రోడ్ షో నిర్వహణ కోసం బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఆదివారం హనుమకొండలో జరిగే రోడ్ షో నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

కేసీఆర్ రోడ్ షోకు వేలాదిగా తరలి రావాలి

మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, ఏప్రిల్ 27 : వరంగల్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్ రోడ్ షో పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో మాజీ స్పీకర్, పాలకుర్తి నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు సిరికొండ మధుసూదనాచారి, రాష్ట్ర నేత మెట్టు శ్రీనివాస్‌తో కలిసి ఎర్రబెల్లి కేక్‌కట్ చేసి మాట్లాడారు. జలదృశ్యం నుంచి జనదృశ్యంగా మారిన పరిణామంలో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదొడుకులు, అణచివేతలు, అవమానాలు ఎదురైనా కేసీఆర్ ఎన్నడూ ఎత్తిన జెండాను దించలేదన్నారు. తెలంగాణ జాతి ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడల్లా కేసీఆర్ సాగించిన ఉద్యమంతో ధిక్కార స్వరమై నిలిచిందని తెలిపారు. అభివృద్ధిలో ముందుకెళ్తున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి, ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయించాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశం అబ్బురపడే రీతిలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ పోరాటం చేసిందని, ఇప్పుడు మరోసారి ప్రజా ఉద్యమం చేసేందుకు సిద్ధమైందన్నారు. మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, ఎంపీపీ తూర్పాటి చిన్నఅంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, డాక్టర్ సోమేశ్వర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, నలమాస ప్రమోద్, కుర్ర శ్రీనివాస్, శామకూరి ఐలయ్య, కర్నె నాగరాజు, జంపా, రాయిశెట్టి వెంకన్న, లేగల వెంకటరెడ్డి, మాచర్ల వెంకన్న పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షో సందర్భంగా హనుమకొండలోని జంక్షన్లను పరిశీలిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాస్యం వినయ్‌భాస్కర్

ఏర్పాట్లు పరిశీలించిన ఎర్రబెల్లి, దాస్యం

హనుమకొండ, ఏప్రిల్ 27 : ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన నేపథ్యంలో హనుమకొండలోని రోడ్‌షో స్థలాలను శనివారం సాయంత్రం బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. రోడ్ షో నిర్వహించే అంబేద్కర్ జంక్షన్, పెట్రోల్ పంప్, హనుమకొండ చౌరస్తా జంక్షన్లను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ క్షేత్రస్థాయిలో తిరిగి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. వీరితో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌బాబు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఉన్నారు.

హనుమకొండలో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న దాస్యం, బండా ప్రకాశ్, ఎర్రబెల్లి, సిరికొండ, సుధీర్‌కుమార్, నన్నపునేని తదితరులు

భూపాలపల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి వెంకటరమణారెడ్డి

జనం గుండెల్లో గులాబీ

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలు

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చి, దేశానికి దిక్సూచిగా నిలిపిందన్న నేతలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శ్రేణుల సంబురాలు

బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో జిల్లా అధ్యక్షులు పాల్గొని గులాబీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడుపోసున్న గులాబీ పార్టీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి కార్మికులు, కర్షకులు, సబ్బండ వర్గాల గుండెల్లో నిలిచిపోయిందని.. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికి దిక్సూచిగా నిలిపిందని నేతలు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

– నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 27

హనుమకొండలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ జెండా ఎగురవేయగా, పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. జనగామ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్యతో కలిసి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావుతో కలిసి జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, జయశంకర్ భూపాలపల్లిలో జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి వెంకటరమణారెడ్డి, ములుగులో జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావుతో కలిసి మహబూబాబాద్ ఎంపీ కవిత గులాబీ జెండా ఆవిష్కరించారు.

ములుగులో జై తెలంగాణ నినాదాలు చేస్తున్న ఎంపీ కవిత, లక్ష్మణ్‌రావు

జనగామలో మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

తొర్రూరులో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేసి మధుసూదనాచారికి తినిపిస్తున్న దయాకర్‌రావు

మహిళా ఓటర్లే అధికం

పార్లమెంట్ ఎన్నికల కోసం తుది ఓటర్ల జాబితా విడుదల

వరంగల్ నియోజకవర్గ పరిధిలో 18,16,609

మహబూబాబాద్‌లో 15,32,366 మంది ఓటర్లు

వరంగల్ కేఎంసీ సెమినార్ హాల్‌లో ఓటు ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మహబూబాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ)/ ఖిలావరంగల్ : ఎన్నికల సంఘం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,32,366 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. ఇందులో పురుషులు 7,47,836 మంది, మహిళలు 7,84,424 మంది, ఇతరులు 106 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే సరికి మానుకోట పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,26,998 మంది ఉండగా, తుది ఓటర్ల జాబితా విడుదల అయ్యే సరికి 15,32,366 మంది ఉన్నారు. అంటే 5,368 మంది ఓటర్లు పెరిగారు. డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,22,906మంది, మహబూబాబాద్‌లో 2,58,850 మంది,నర్సంపేటలో 2,35,849 మంది, ములుగు 2,33,191 మంది, పినపాకలో 2,03,790 మంది, ఇల్లందులో 2,25,097 మంది, భద్రాచలంలో 1,52,683 మంది, ఇతరులు 106 మంది ఉన్నారు.

వరంగల్ నియోజకవర్గంలో..

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో 18,16,609 మంది ఓటర్లు ఉండగా, 8,92,676 మంది పురుషులు, 9,23,541 మంది మహిళలు, 392 మంది థర్డ్ జెండర్స్ ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,52,618 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,24,669 మంది, మహిళలు 1,27,948, ఒకరు థర్డ్ జెండర్, పాలకుర్తి నియోజకవర్గంలో 2,54,807 మంది ఓటర్లలో 1,26,261 మంది పురుషులు, 1,28,533 మహిళలు, 13 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు. పరకాల నియోజకవర్గంలో 2,22,266 మందిలో 1,08,159 మంది పురుషులు, 1,14,105 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్స్ ఉన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,798 మంది ఓటర్లలో 1,38,673 మంది పురుషులు, 1,43,111 మంది మహిళలు, 14 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 2,56,507 మందిలో 1,24,733 మంది పురుషులు, 1,31,435 మంది మహిళలు, 339 మంది థర్డ్ జండర్స్ ఉన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో 2,72,078 మందిలో 1,33,541 మంది పురుషులు, 1,38,520 మంది మహిళలు, 17 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,535 మందిలో 1,36,640 మంది పురుషులు, 1,39,889 మంది మహిళలు, ఆరుగురు థర్డ్ జెండర్స్ ఉన్నారు.



మానుకోటలో పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాలోత్ కవిత

హామీలకే కాంగ్రెస్ పరిమితం

కేసీఆర్ ప్రభుత్వంలోనే పేదలకు లబ్ధి : ఎంపీ మాలోత్ కవిత

గత పదేళ్లలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి : ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 27 : కేసీఆర్ ప్రభుత్వ పాలనలోనే పేదలకు లబ్ధి జరిగిందని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా నాయకులతో కలిసి ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, ఎన్నికల తర్వాత వాటి అమలును విస్మరించిందన్నారు. దళితులు, లంబాడాలు, ఆదివాసులకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో దళితబంధు పథకాన్ని అమలు చేసి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నేతృత్వంలో అనేక పోరాటాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో రాష్ట్రంలోని అన్ని రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. అనేక పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు అనేక మాయమాటలు చెప్పడంతో ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, ఇప్పుడు ఎందుకు ఓట్లు వేశామా అని బాధపడుతున్నట్లు చెప్పారు. మళ్లీ ప్రజల చూపు కేసీఆర్‌వైపే ఉందని, పేదల సమస్యలను పరిష్కరించేది కేసీఆర్ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా, భరత్‌కుమార్‌రెడ్డి, ఎండీ ఫరీద్, గద్దె రవి, గోకుల రాజు, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణు, జేరిపోతుల వెంకన్న, బూర్ల ప్రభాకర్, మందుల రఘు, పొన్నాల యుగేంధర్, రాము రావిష్, కిరణ్, శంకర్, నీలేశ్ పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్‌లో రోబోటిక్ సర్జరీ సిస్టం

ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్‌కు అసిస్టెంట్‌గా రోబోటిక్ సిస్టం

దవాఖాన కన్సల్టెంట్ సర్జన్ లక్ష్మీకుమారి

మాట్లాడుతున్న యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ సర్జన్ లక్ష్మీకుమారి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 27 : అత్యాధునిక డావిన్సీ-11 రోబోటిక్ సర్జికల్ సిస్టం అందుబాటులోకి వచ్చిందని సోమాజీగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ సర్జికల్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కోన లక్ష్మీకుమారి తెలిపారు. శనివారం హనుమకొండ అశోకా హోటల్‌లో ఆమె మాట్లాడుతూ.. కచ్చితత్వంతో శస్త్రచికిత్స ఫలితాలను మెరుగుపర్చడానికి రూపొందించిన డావిన్సీ-11 రోబోటిక్ సర్జికల్ సిస్టం విశేషమైన పురోగతిని అందిస్తుందన్నారు. సంప్రదాయ ఓపెన్ సర్జరీ లేదా ల్యాప్రోస్కోపిక్ విధానాలతో పోలిస్తే ఈ వినూత్న వ్యవస్థ అనేక ప్రయోజనాలను అందించి, రోగులు వేగంగా కోలుకునేలా చేస్తుందన్నారు. యశోద హాస్పిటల్స్ 3 దశాబ్దాలుగా విభిన్న వైద్య చికిత్సలు అందిస్తున్నదని, అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామని చెప్పారు. సోమాజిగూడ, సికింద్రాబాద్, మలక్‌పేట్, హైటెక్ సిటీల్లో 4 వేల పడకలతో 4 ఇండిపెండెంట్ హాస్పిటల్స్ ఉన్నాయని, ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నామన్నారు.